క్లుప్తంగా

పేదల ఆరోగ్యమే లక్ష్యం

వెల్దండ: పేదల ఆరోగ్యమే ఐక్యత ఫౌండేషన్‌ లక్ష్యమని ఆ సంస్థ చైర్మన్‌ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్‌, శంకర నేత్రాలయా చెన్నై ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంటి వైద్య శిబిరంలో దాదాపుగా 1900 మంది కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. ఇందులో 136 మందికి కంటి శుక్ల ఆపరేషన్లు, 1100 మందికి కంటి అద్దాలు, మరో 200 మందిని కంటి ఆపరేషన్‌కు చెన్నై శంకర నేత్రాలయ బేస్‌ ఆస్పత్రికి రిఫర్‌ చేసినట్లు వివరించారు. అనంతరం రోగులకు కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో అనిల్‌గౌడు, శ్రీరాములు, నరేందర్‌గౌడు, మల్లయ్య, రమేష్‌నాయక్‌, కొండల్‌యాదవ్‌, గణేష్‌, హస్సన్‌, మల్లేష్‌, శ్రీపతి, శేఖర్‌, శ్రీను, కల్యాణ్‌, మహేష్‌, తదితరులు ఉన్నారు.

నూతన తహసీల్దార్‌గా ఎ.సునీత



ఉప్పునుంతల: మండలంలో నూతన తహసీల్దార్‌గా ఎ సునీత గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్‌ శ్రీకాంత్‌ నల్గొండ జిల్లా సూర్యపేటకు బదిలీ అయ్యారు.

ఎస్‌ఐకి సన్మానం

కోడేరు: మండలానికి బదిలీపై వచ్చిన ఎస్‌ఐ కుర్తికుంట గోకారిని గురువారం కాంగ్రెస్‌ నాయకులు సన్మానించారు. శాంతిభద్రతల పరిరక్షణకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండల మాజీ కోఆప్షన్‌ మెంబర్‌ అబ్దుల్‌ఖరీం, గడ్డం నరసింహ, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, గాజుల వెంకటస్వామి, పాడేండ్ల నాగశేషి, ఆది శరత్‌, గుట్ట ఉస్మాన్‌, మిద్దె నాగేష్‌ బాబు, సల్మాన్‌ ఉన్నారు.

ఫీవర్‌ సర్వే



మన్ననూర్‌: సీజనల్‌ వ్యాధుల నివారణలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల సూచన మేరకు పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి తిరుగుతూ ఫీవర్‌ సర్వే నిర్వహించారు. అమ్రాబాద్‌ మండలం వటువర్లపల్లిలో గురువారం వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించారు. నీటి తొట్లు, పాత్రల్లో నిలువ ఉన్న నీటిని పారబోశారు. స్వల్ప అస్వస్థతకు గురైన వారికి పరీక్షలు నిర్వహించారు. కలుషిత ఆహారం తినొద్దని , తాజా ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అభిలాష్‌, ఎల్‌టీ హరిలాల్‌, ఆరోగ్య కార్యకర్తలు లోక్యానాయక్‌, హన్మంత్‌, ఆశా కార్యకర్త లింగమ్మ పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడిగా లక్ష్మారెడ్డి

కల్వకుర్తిరూరల్‌: లయన్స్‌ క్లబ్‌ ఆమనగల్‌ 39వ అధ్యక్షుడిగా పసుల లక్ష్మారెడ్డి ఎంపికైనట్లు క్లబ్‌ పీఆర్‌ఓ పాషా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా మహేష్‌, కోశాధికారిగా నర్సింహ, ఉపాధ్యక్షులుగా గోవర్ధన్‌రెడ్డి, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

కల్వకుర్తిరూరల్‌: మండలంలోని గుండూరు గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు గురువారం కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో జాని, రాజేందర్‌, కిరణ్‌, లక్ష్మయ్య, పరశురాములు, శేఖర్‌, అశోక్‌, విజేందర్‌ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వీడ్కోలు



కొల్లాపూర్‌: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో సీనియర్‌ విద్యార్థులకు జూనియర్లు గురువారం కళాశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్‌ మార్క్‌పోలోనియస్‌ మాట్లాడుతూ పీజీ విద్య పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



బల్మూర్‌: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాన్ని గురువారం ఎంపీడీఓ రాఘవులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా భోజన వసతి, శానిటేషన్‌, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత అంశాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్‌ఓ లలితకు వివరించారు. తనిఖీలో ఎంఈఓ రామారావు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

- పెచ్చులూడుతున్న పాఠశాల భవనం
- భయాందోళనల మధ్య విద్యార్థుల చదువులు

అచ్చంపేట రూరల్‌: పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ఎన్ని చర్యలు తీసుకుంటున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. ప్రభుత్వం విద్య అభివృద్ధికి రూ.కోట్ల నిధులు వెచ్చిస్తున్నా ఆశించిన స్థాయిలో లక్ష్యం నెరవేరడం లేదు. ప్రభుత్వాలు మారినా పాఠశాలలు అభివృద్ధికి మాత్రం నోచుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థులకు సరిపడ తరగతి గదులు, ఇతర మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామాల్లో పలు పాఠశాలలు శిథిలావస్థకు చేరాయి. పాఠశాలలకు వెళ్లేందుకు విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. పాఠశాలల పైకప్పు పెచ్చులూడి పడుతున్నా... గత్యంతరం లేక విద్యార్థులు ఇబ్బందుల మధ్య భయాందోళనలో చదువులను కొనసాగిస్తున్నారు. గత ప్రభుత్వంలో మన ఊరు– మన బడి కార్యక్రమం చేపట్టినా బడులు బాగుపడలేదు.



పాఠశాల ఆవరణ దుస్థితి



పెచ్చులూడుతున్న పాఠశాల పై కప్పు

శిథిలావస్థలో పాఠశాల..

అచ్చంపేట మండలం ఏజెన్సీ గ్రామమైన జోగ్యతండాలో గతేడాది కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పాఠశాల గదుల్లో వర్షపు నీరు చేరింది. తరగతి గదులు బురదమయంగా తయారయ్యాయి. పైకప్పు పెచ్చులూడి ఇనుప కడ్డీలు కన్పిస్తున్నాయి. జోగ్యతండాలోని ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి మూడు తరగతులకు గానూ ప్రస్తుతం 10 మంది విద్యార్థులు ఉండగా అంగన్‌వాడీ కేంద్రం నుంచి నలుగురు విద్యార్థులు పాఠశాలలో చేరనున్నారు. మొత్తం మూడు గదుల్లో ఒక గది ఆఫీసుకు కేటాయించారు. మిగతా రెండు గదుల్లో విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. మొత్తం మూడు గదులు శిథిలావస్థకు చేరినా తప్పని పరిస్థితుల్లో విద్యా బోధన కొనసాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం మన ఊరు–మనబడి కింద పాఠశాలను ఎంపిక చేయకపోవడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల చదువులకు ఆటంకం ఏర్పడే ప్రమాదం ఏర్పడిందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

ముసురు వర్షంతో ముప్పు....

ప్రస్తుతం కురుస్తున్న ముసురు వర్షాలకు పాఠశాలలో ప్రమాదం పొంచి ఉంది. గతంలో విద్యార్థులకు బోధిస్తున్న క్రమంలో పెచ్చులూడి పడిన సంఘటనలూ ఉన్నాయి. ప్రస్తుతం బిక్కుబిక్కుమంటూ భయాందోళన మధ్యనే ఆ పాఠశాలలో చదువు సాగుతోంది. విద్యాశాఖ అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల స్థానాల్లో నూతనంగా భవనాలు నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం



పాఠశాల శిథిల భవనాలు, మౌలిక వసతులపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాం. జోగ్యతండా పాఠశాల పరిస్థితిని స్థానిక ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అసంపూర్తిగా ఉన్న పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం.

– రామారావు, ఇన్‌చార్జ్‌ ఎంఈఓ, అచ్చంపేట

మౌలిక వసతులు కల్పించాలి

అచ్చంపేట రూరల్‌: పట్టణంలోని ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్‌ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్‌ డిమాండ్‌ చేశారు. గురువారం హాస్టల్‌ను సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికల పాఠశాల, కళాశాలకు సంబంధించిన విద్యార్థులకు ఒకే చోట వసతి ఏర్పాటు చేయడంతో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారన్నారు. వర్షాకాలంలో చన్నీళ్లతో స్నానం చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



అచ్చంపేటలో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న మల్లేష్‌

సమాజంపై అవగాహన అవసరం



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు

వెల్దండ: విద్యార్థులకు సమాజంపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్‌ ప్రవంతి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలల్లో శిక్ష సప్తాహ్‌ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. బాల్య వివాహల నిర్మూలన, ఆత్మరక్షణ, పండుగ ఉత్సవాలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం తదితరులు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శిక్ష సప్తాహ్‌ కార్యక్రమంలో భాగంగా జానపద, నృత్యం, కోలాటం, బతుకమ్మ, భక్తిగీతాలు, ఏకపాత్ర అభినయం క్రీడలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం



కల్వకుర్తి: సీఎం రేవంత్‌ రెడ్డి కల్వకుర్తి పర్యటనను విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకుల, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 28న ముఖ్యమంత్రి కల్వకుర్తిలో పర్యటిస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్‌ సభ్యులు బాలాజీ సింగ్‌, నాయకులు శ్రీనివాస్‌గౌడ్‌, అశోక్‌ రెడ్డి, సూదిని రాంరెడ్డి, యాట నర్సింహ్మ, మోతీలాల్‌ నాయక్‌, ఆనంద్‌ కుమార్‌, విజయ్‌ కుమార్‌ రెడ్డి పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలని సీపీఎం నిరసన

బల్మూర్‌: మండలంలోని నర్సాయపల్లి గ్రామానికి బీటీ రోడ్డుకు రెన్యూవల్‌ కోట్‌ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ గురువారం సీపీఎం నాయకులు గ్రామస్తులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దేశ్యానాయక్‌, మండల కార్యదర్శి శంకర్‌నాయక్‌ మాట్లాడారు. 15 ఏళ్ల కిందట అచ్చంపేట–లింగాల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నర్సాయపల్లి గ్రామానికి వేసిన బీటీ రోడ్డు ప్రస్తుతం కంకర తేలి గుంతల మయంగా మారిందన్నారు. వెంటనే నిధులు కేటాయించి రోడ్డును బాగు చేయాలని డిమాండ్‌ చేశారు. బాలు, రాజు, సరియా, శంకర్‌, సీతారాం, బాలాజి గ్రామస్తులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఉపాధ్యాయులను రిలీవ్‌ చేయాలి

కొల్లాపూర్‌ రూరల్‌: పదోన్నతులపై బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్‌ చేయాలని యూటీఎఫ్‌ జిల్లా అధ్యక్షుడు ఆర్‌. కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. గురువారం మండల పరిధిలోని వివిధ పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కార్యదర్శి శంకర్‌, మండల ప్రధాన కార్యదర్శి రబ్బాని, జిల్లా నాయకులు మహమ్మద్‌, కుర్బాన్‌అలీ, వెంకటేశ్వర్లు, రుక్మద్దిన్‌, బజీర్‌, శ్రీరాంనాయక్‌, వేణుగోపాల్‌, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

కొల్లాపూర్‌: పట్టణంలోని ఎన్టీఆర్‌ చౌరస్తాలో సీపీఎం నాయకులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివర్మ, నాయకులు బాలపీరు, సలీం, సురేందర్‌, మధు, వెంకటస్వామి ఉన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్‌: కేంద్ర ప్రభుత్వానికి విద్యారంగంపై చిత్తశుద్ధి లేదని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రేమ్‌కుమార్‌, మధుగౌడ్‌లు విమర్శించారు. గురువారం విద్యార్థి సంఘం నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. విభజన హామీ చట్టం ప్రకారం తెలంగాణ విద్యారంగానికి రావాల్సిన నిధులు ఇవ్వకపోగా కనీసం రావాల్సిన విద్యాసంస్థలను ఒక్కటి కూడ కేటాయించకపోవడం దురదృష్టకరమన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి నిధులు కేటాయించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులు పాల్గొన్నారు.

సీఈఓ పోస్ట్‌కు దరఖాస్తు ఆహ్వానం

వెల్దండ: మండల కేంద్రంలోని మహిళ రైతు ఉత్పత్తిదారుల కంపనీలో సీఈఓగా విధులు నిర్వర్తించడానికి మహిళ రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఎం సంతోష్‌ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అగ్రికల్చరల్‌ గ్రాడ్యుయేషన్‌, మార్కెటింగ్‌, అగ్రికల్చర్‌ డిప్లొమా పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆగస్టు 5వ తేదీ వరకు గడువు ఉందని, పూర్తి వివరాలకు సెల్‌: 8790990883కు సంప్రదించాలని తెలిపారు.

రాష్ట్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

బీసీలను విస్మరించడం సరికాదు



పెద్దకొత్తపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై గురువారం మిశ్రమ స్పందన లభించింది. రాష్ట్రంలో 55 శాతం జనాభా ఉన్న బీసీలకు రూ.92 కోట్లు మాత్రమే కేటాయించడం సరికాదు. బడ్జెట్‌లో బీసీలకు తగిన నిధులు కేటాయించలేదు. బీసీలను విస్మరించడంపై అసంతృప్తి కలిగించింది.

– దాసరి అజయ్‌కుమార్‌యాదవ్‌, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రజాపార్టీ

ప్రాజెక్టులపై ప్రభుత్వం నిర్లక్ష్యం



కొల్లాపూర్‌: రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు తక్కువగా కేటాయించారు. కేఎల్‌ఐ ప్రాజెక్టుకు రూ.700 కోట్లు, పాలమూరు ప్రాజెక్టుకు రూ.2,200 కోట్లు కేటాయించడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోంది.

– కలమూరి నిరంజన్‌, మాజీ రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్‌, కొల్లాపూర్‌

అందరికి ఆమోదయోగ్యమైనది

మన్ననూర్‌: తెలంగాణ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024–25 వార్షిక బడ్జెట్‌ అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని విశ్రాంత ఉద్యోగి, సీనియర్‌ నాయకులు సంబు వెంకటరమణ అభిప్రాయం వ్యక్తం చేశారు. గురువారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్‌ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరమన్నారు. సీనియర్‌ నాయకులు ఎంఏ రహీం, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ ఉన్నారు.



అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



అమ్రాబాద్‌: అన్నివర్గాల అభివృద్ధే ప్రభుత్వం లక్ష్యమని యూత్‌ కాంగ్రెస్‌ రాష్ట్ర కార్యదర్శి కుందమల్లికార్జున్‌ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికశాఖమంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌ అన్నివర్గాలకు ఆమోదయోగ్యంగా ఉందని వివరించారు. వ్యవసాయం, విద్యారంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో ఎస్సీ సంక్షేమం కోసం అధిక నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. చింతల రాజ్‌గోపాల్‌, లోకనాథం, ఎడ్ల ఆనంద్‌కుమార్‌, ఉన్నారు.

ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత

అచ్చంపేట రూరల్‌: ఆరు క్వింటళ్ల నిషేధిత నల్లబెల్లాన్ని గురువారం సిద్దాపూర్‌ పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ పవన్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం మన్నెవారిపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. నల్లగొండ జిల్లా కొండమల్లెపల్లి మండలం చెన్నారం గ్రామానికి చెందిన ఆంబోతు తరుణ్‌, పోలేపల్లికి చెందిన రామావత్‌ నాగరాజు అశోక్‌లీలాండ్‌ వాహనంలో నల్లబెల్లం, పటికను తరలిస్తునట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ఆరు క్వింటాళ్ల నల్లబెల్లం, 40 కిలోల పటికతో పాటు వాహనాన్ని సిద్దాపూర్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అరెస్టు

కొల్లాపూర్‌: మండలంలోని గోప్లాపూర్‌ గ్రామానికి సారా తరలిస్తున్న వీపనగండ్ల మండలానికి చెందిన కిష్టయ్యను గురువారం ఎక్సైజ్‌ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 8 లీటర్ల సారా, బైక్‌ స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నాగిరెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఎస్‌ఐ హనుమంతు, సిబ్బంది మంజుల, దస్తగిరి, వెంకటేష్‌, శ్రీశైలం పాల్గొన్నారని ఆయన తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఎంపీడీఓ కృష్ణయ్య కోరారు. గురువారం మండల కేంద్రలోని స్త్రీశక్తి భవనంలో మండల మహిళా సమైక్య ప్రత్యేక కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసే సమావేశాలకు అధిక సంఖ్యలో హాజరు కావాలని సూచించారు. అనంతరం ఐకేపీ డీపీఎంఐబీ శ్రీనివాసులు మాట్లాడుతూ మండల మహిళా సమైక్య మోడల్‌గా ఎంపికై ందన్నారు. ఆదర్శ మండలంగా తీర్చుదిద్దుదామన్నారు. జిల్లాలో మొదటి విడతగా బిజినేపల్లి, తిమ్మాజిపేట, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్‌ రెండో విడతలో తాడూరు, తెలకపల్లి, బల్మూరు, మోడల్‌ మండలాలుగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఆయా మండలాలకు శిక్షణ ఇస్తున్నామని కమ్యూనిటీ మేనేజ్‌మెంట్‌ శిక్షణ కేంద్రంగా కొనసాగుతుందన్నారు. లింగవివక్షత, అంటరానితనంపై, ఆర్థిక అక్షరాస్యతపై కిశోర బాలికలకు, యువకులకు ఉపాధిపై శిక్షణ బైలా గురించి ఆడిటింగ్‌ గురించి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఏపీఎం నిరంజన్‌, డీపీఎం శ్రీనివాసులు, అధ్యక్షురాలు అర్చన, అమృత, సీసీలు సుజాత, నర్సింహ, రామచంద్రమ్మ, సుగుణమ్మ, ఎల్లమ్మ, రామదేవి, సునీత, రాములమ్మ, పర్వీన్‌బేగం, బాలచంద్రమ్మ, శ్వేత, శైలజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణయ్య

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



రోడ్డును పరిశీలిస్తున్న నరసింహ

కోడేరు: సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని సీపీఎం మండల కార్యదర్శి నరసింహ అన్నారు. గురువారం మండలంలోని మాచుపల్లిలో ప్రజా సమస్యలపై అధ్యయన యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నాలుగేళ్ల కిందట విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేసినా తీగల బిగించకపోవడం దారుణమన్నారు. మురుగు రోడ్లపై పారుతోందని అధికారులు వెంటనే సమస్య పరిష్కరించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం సమస్యలపై పంచాయతీ కార్యదర్శి రమేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాములు, వెంకటయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని పలు కాలనీలలో ప్రజా సమస్యలపై అధ్యయన యాత్రలో భాగంగా గురువారం సీపీఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌ ఆధ్వర్యంలో నాయకులు పర్యటించారు. సమస్యలను గుర్తించి గ్రామ పంచాయతీ సిబ్బందికి వినతిపత్రం ఇచ్చారు. హనుమంతు, చిట్టెమ్మ, రామస్వామి, కురుమయ్య, సాయమ్మలు పాల్గొన్నారు.

కొల్లాపూర్‌: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చైర్‌పర్సన్‌ మేకల రమ్య నాగరాజు, కమిషనర్‌ శ్రీనివాసన్‌కు గురువారం సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ వినతిపత్రం అందజేశారు. నాయకులు సలీం, వెంకట్‌, జల్లాపురం సురేందర్‌, బత్తిని రాజు, సంజీవ్‌, సాయికుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్‌: పట్టణంలోని 12, 14, 19 వార్డుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్‌ శ్రీనివాసులు డిమాండ్‌ చేశారు. గురువారం ఆయా వార్డుల్లో ప్రజ సమస్యలపై అధ్యయన యాత్ర కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు సమస్యలతో కూడిని వినతిపత్రాన్ని మున్సిపల్‌ కమిషనర్‌కు అందజేశారు. కందికొండ గీత, యాదయ్య, మండల కార్యదర్శి అశోక్‌, సురేష్‌, శివరాం తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయులకు పదోన్నతులు

ఉప్పునుంతల: పీఆర్‌టీయూ పోరాటాల కారణంగా రాష్ట్రంలో 25 వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు అయ్యాయిన పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. పీఆర్‌టీయూ సభ్యత్వ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని ఆయా పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మండలంలోని ఉప్పునుంతల, వెల్టూరు, కాంసానిపల్లి, పెనిమిళ్ల జెడ్పీహెచ్‌ఎస్‌లతోపాటు కేజీబీవీ ఉప్పునుంతల, ప్రాథమిక పాఠశాల కాంసానిపల్లి పాఠశాలలను పీఆర్‌టీయూ నాయకులు సందర్శించి ఉపాధ్యాయులను కలిసి సభ్యత్వాలను చేయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్‌ మాట్లాడుతూ.. బదిలీలలో మిగిలిన ఖాళీలతో పాటు పీఆర్‌సీ, ఫిట్‌మెంట్‌, డీఏలను ఇప్పించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకులు బిచ్యానాయక్‌, మల్లికార్జున్‌, శ్యాంసుందర్‌గౌడ్‌, జిల్లా బాధ్యులు అజ్మతుల్లా, మండల నాయకులు నరసింహ్మారెడ్డి, అమీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో సభ్యత్వాలు చేయిస్తున్న నాయకులు

ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్‌: ఎంఈఓను వెంటనే సస్పెండ్‌ చేయాలని కోరుతూ పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు సంతోష్‌ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్‌ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలలకు అండగా ఉన్నారని ఆరోపించారు. అనుమతులు లేకుండా నడుస్తున్న పాఠశాలల గురించి వివరించినా ఎంఈఓ పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులతో ఎంఈఓ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ధర్నాలో అర్జున్‌, అనీల్‌, శుక్లాల్‌ తదితరులు పాల్గొన్నారు.

ఐఏఎస్‌ అధికారి స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: దివ్యాంగుల రిజర్వేషన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్‌ అధికారి స్మితా సబర్వాల్‌పై గురువారం పట్టణంలోని పోలీసుస్టేషన్‌లో నాగర్‌కర్నూల్‌ దివ్యాంగుల కమిటీ ఆధర్యంలో ఎస్‌ఐ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ నాగరాజు, రాము, రమేష్‌, ఏ రాము, లక్ష్మి, శిరీష, బొందమ్మలు పాల్గొన్నారు.

రిజిస్టర్ల తనిఖీ

లింగాల: మండలంలోని అప్పాయపల్లి, మల్లొనిచెర్వుతండా, చెన్నంపల్లి, పద్మన్నపల్లి, దారారం పాఠశాలలను గురువారం మండల నోడల్‌ అధికారి జీహెచ్‌ఎం బషీర్‌ అహ్మద్‌ సందర్శించారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట సీఆర్పీ హరిలాల్‌, పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పుష్కరఘాట్లను తాకిన కృష్ణమ్మ



పెంట్లవెల్లి: ఎగువ జూరాల ప్రాజెక్టు నుంచి దిగువ శ్రీశైలం ప్రాజెక్ట్‌కు వరదనీరు పోటెత్తింది. మండలంలోని జటప్రోల్‌, మంచాలకట్ట, వేముకల్‌, మల్లేశ్వరం, సోమశిల గ్రామాల్లో పుష్కరఘాట్లను కృష్ణానది నీరు చేరింది. రెండుమూడు రోజుల్లో పూర్తి స్థాయిలో నీటిమట్టం చేరే అవకాశం ఉంది. కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లొద్దని ఎస్‌ఐ రామన్‌గౌడ్‌ కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లికి చెందిన తోల కిష్టయ్య అనారోగ్యంతో వారం రోజుల కిందట మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ సింగిల్‌విండో చైర్మన్‌ జంబుల బుచ్చారెడ్డి గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి కిష్టయ్య భార్య భాగ్యమ్మకు రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. అర్జునయ్య, కురువ ఎజ్జు, అంజి, భయ్యారాంబాబు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి



నాగర్‌కర్నూల్‌రూరల్‌: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో త్వరలో ఇందిరాపార్క్‌ వద్ద ధర్నా చేపడుతున్నట్లు జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్‌ పేర్కొన్నారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. 50 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.10 వేల పింఛన్‌ ఇవ్వాలని, తెల్లరేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి లేబర్‌ కార్డు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చినపాగ శ్రీనివాసులు, మేస్త్రీలు రాముడు, భీముడు, ఆంజనేయులు, బాలయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ నాయకుడి మృతిపై సంతాపం

మన్ననూర్‌: కాంగ్రెస్‌ పార్టీ, ఆర్యవైశ్య సంఘం సీనియర్‌ నాయకుడు గంధి శ్రీధర్‌ మృతిపై ఆర్యవైశ్య మహాసభ, గ్రామ సంఘం నాయకులు గురువారం ఓ ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. నాలుగు దశాబ్దాలుగా కాంగ్రెస్‌ పార్టీలో ఉంటూ పార్టీ అభివృద్ధే ధ్యేయంగా పని చేశారని తెలిపారు. ఆయన మృతి కాంగ్రెస్‌ పార్టీ, ముఖ్యంగా ఆర్యవైశ్యులకు తీరనిలోటగా భావిస్తున్నామని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు వెంకటరమణ, సత్యనారాయణ, మన్ననూర్‌ గ్రామ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రమేష్‌ నాయకులు వేణుగోపాల్‌ పేర్కొన్నారు.